సభ్యత్వ కార్యక్రమాన్ని సత్వరం పూర్తిచేయండి

● నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు స్టాలిన్ ఆదేశం


దిండుగల్ నియోజకవర్గం ఇన్‌ఛార్జితో స్టాలిన్

చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీ సభ్యత్వ కార్యక్రమాలను వీలైనంత త్వరగా ముగించాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆదేశాలిచ్చారు. పార్టీ ప్రధాన కార్యాలయం అరివాలయంలో 'ఉడన్ పిరప్పేవా' (తోబుట్టువా రా) పేరుతో శాసనసభ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, జిల్లా కార్యదర్శులతో ఆయన వరుసగా సమావేశమవుతున్నారు. ఆ మేరకు దిండుగల్, వేడచందూరు, వేప్పనహళ్ళి నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రి ఆర్.చక్రపాణి, దిండుగల్ తూర్పు జిల్లా శాఖ కార్యదర్శి ఐపి సెంథిల్‌కుమార్, కృష్ణగిరి వెస్ట్ జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఒక్కో నియోజకవర్గం ఇన్‌ఛార్జితో ఆయన గంటసేపు ఆయన సమావేశమయ్యారు. ఆ తర్వాత మూడు నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో సమావేశమై ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులు, సభ్యత్వ కార్యక్రమాలు జరుగుతున్న తీరు తెలుసుకున్నారు. ఈసారి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు మునుపటి మెజారిటీ కంటే రెట్టింపు మెజారిటీతో గెలిచేందుకు ఇన్‌ఛార్జులు, జిల్లా కార్యదర్శులు, తీవ్రంగా కృష చేయాలని, పార్టీ అధ్యక్షుడిగా తానిచ్చిన పిలుపుమేరకు 200లకు పైగా నియోజకవర్గాలలో డీఎంకే కూటమి అభ్యర్థులు గెలవాలన్న లక్ష్యసాధనకు తోడ్పడాలని పేర్కొన్నారు.

వార్‌రూమ్ ఏర్పాటు...

ఇదిలా ఉండగా అరివాలయంలో డీఎంకే సమాచార సాంకేతిక విభాగం ఆధ్వర్యంలో శనివారం కొత్త వార్ రూమ్ ఏర్పాటు చేశారు. 'ఏకతాటిపై తమిళనాడు' నినాదంతో సభ్యత్వ కార్యక్రమాలు ఏయే నియోజకవర్గాల్లో ఎంత వేగంగా జరుగుతున్నాయనే విషయాలను ఈ వార్ రూమ్ ద్వారా తెలుసుకోవచ్చని స్టాలిన్ తెలిపారు. అంతే కాక తాను వార్‌రూమ్‌లో ఉన్నప్పుడు రాష్ట్రం నలుమూలల నుండి పార్టీ నేతలు, జిల్లా కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించేందుకు వీలుందన్నారు. ఈ వార్ రూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి టీఆర్బీ రాజా, డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్‌ఎస్ భారతి, ప్రచార విభాగం అధ్యక్షుడు టీకేఎస్ ఇలంగోవన్, పార్టీ డిప్యూటీ వ్యవస్థాప కార్యదర్శి అన్బగం కళై, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ అధ్యక్షుడు పూచ్చి ఎస్ మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

14న రైలులో చిదంబరానికి సీఎం

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): 'ఉంగళుడన్ స్టాలిన్' పథక ప్రారంభోత్సవానికి ఈ నెల 14న రైలులో ముఖ్యమంత్రి స్టాలిన్ చిదంబరం వెళ్లనున్నారు. ఆ మేరకు సోమవారం సాయంత్రం చెన్నై ఎగ్మూర్ నుంచి రామేశ్వరం సూపర్ ఫాస్ట్ రైలులో సీఎం చిదంబరం వెళ్లనున్నారు. చిదంబరం మున్సిపాలిటీలో 15న జరిగే కార్యక్రమంలో 'ఉంగళుడన్ స్టాలిన్' పథకాన్ని సీఎం ప్రారంభించనున్నారు. అలాగే, 15.16 తేదీల్లో మైలాడుదురై జిల్లాలో అభివృద్ధి పనులు, ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాల అమలుపై సీఎం క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. కార్యక్రమం అనంతరం 16వ తేది చోళన్ ఎక్స్‌ప్రెస్‌లో సీఎం నగరానికి రానున్నట్లు సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.



సొంత మెజారిటీతోనే అధికారంలోకి వస్తాం


కడలూరు రోడ్‌షోలో ప్రసంగిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

ఎడప్పాడి ధీమా

అడయార్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో అన్నాడీఎంకే సంపూర్ణ మెజార్టీ సాధించి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల నేపథ్యంలో ఆయన రాష్ట్రవ్యాప్త పర్యటనకు శ్రీకారం చుట్టారు. ఇందులోభాగంగా, శుక్రవారం విల్లుపురం పర్యటనను ముగించుకుని కడలూరు వెళుతూ పుదుచ్చేరి సమీపంలోని ఒక అతిథి గృహంలో విశ్రాంతి తీసుకున్నారు. శనివారం సాయంత్రం కడలూరు జిల్లాకు చెందిన రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం కడలూరు నగరంలో రోడ్‌షోలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వం పతనం కావటం తధ్యమని, సొంత మెజారిటీతోనే తమ పార్టీ అధికారంలోకి వస్తుందని, ఈ విషయంలో పార్టీ శ్రేణులకు ఎలాంటి అనుమానాలు అక్కర్లేదన్నారు. అంతకుముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ, వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే అత్యధిక స్థానాలు గెలుచుకుని పూర్తి మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే, ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. రాష్ట్రంలో కూటమి పాలన తథ్యమంటూ వ్యాఖ్యానించారు. ఎడప్పాడి మాత్రం అన్నాడీఎంకే పూర్తి మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పడం గమనార్హం.

మా కూటమి గెలిస్తే... తమిళనాట సంకీర్ణ ప్రభుత్వమే

● కేంద్ర హోం మంత్రి అమిత్‌షా



చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తమిళనాట వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ సభ ఎన్నికల్లో ఎన్డీయే గెలిస్తే ఆ రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సుస్పష్టంగా ప్రకటించారు. అన్నాడీఎంకే నేతలందరూ రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశమే లేదని, సొంత మెజారిటీతో తాము అధికారంలోకి వస్తామంటూ చెబుతున్న తరుణంలో అమిత్ షా చేసిన ఈ ప్రకటన రెండు పార్టీల మధ్య తీవ్ర కలకలం సృష్టించింది. బీజేపీ నేత కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ శాసనసభ ఎన్నికలపై అమిత్‌షా సూచనలే తమకు వేదంతో సమానమని వ్యాఖ్యానించారు. అదే సమయంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి శనివారం పర్యటనలో పలు చోట్ల శాసనసభ ఎన్నికల్లో సొంత మెజారిటీతోనే అధికారంలోకి వస్తామని ప్రకటించారు. అమిత్ షా ఓ ప్రముఖ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై తన అభిప్రాయాలను కుండ బద్దలు కొట్టినట్లు తెలిపారు. తమిళనాట గతంలో ఎన్నడూ లేనంతగా బీజేపీకి బలమైన సానుకూల పవనాలే వీస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో హిందీ నిర్బంధంగా అమలు చేస్తున్నామని ప్రత్యర్థులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమేనని చెప్పారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్ని భాషలకు సమానమైన గౌరవమే ఇస్తోందని, నీట్‌ను తమిళం సహా అన్ని భాషల్లోనూ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో మద్యం కొనుగోలులో, రవాణా శాఖలలో కోట్లాది రూపాయల మేరకు అవినీతి అక్రమాలు జరిగాయని, డీఎంకే ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, ఈ విషయాలన్నీ రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని, ఆ పార్టీకి గుణపాఠం చెప్పేందుకు తగిన అవకాశం ఎదురు చూస్తున్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీ ప్రభుత్వాన్ని పడగొట్టడం ఖాయమని అన్నారు.

అమిత్ షా చెప్పిందే మా నిర్ణయం...!

● కేంద్ర మంత్రి ఎల్.మురుగన్

చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికార భాగస్వామ్యంపై కేంద్ర మంత్రి అమిత్ షా చెప్పిన మాటకు తాము కట్టుబడి ఉంటామని కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురగన్ తెలిపారు. నగరంలో శనివారం మురుగన్ మీడియాతో మాట్లాడుతూ.. యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పలు పథకాలు అందిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో అన్నాడీఎంకే-బీజేపీ కూటమి విజయం తథ్యమన్నారు.

18 వరకు వర్షసూచన

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆదివారం నుంచి 18వ తేది వరకు ఒకటి, రెండు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశముంది. ఈ మేరకు ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రం వైపు వీస్తున్న పశ్చిమ గాలుల వేగంలో మార్పు కారణంగా ఆదివారం నుంచి 15వ తేది వరకు ఒకటి, రెండు ప్రాంతాలు, 16,17,18 తేదీల్లో మరిన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. నీలగిరి, కోవై జిల్లాల్లోని కొండ ప్రాంతాల్లో 15 నుంచి 19వ తేది వరకు భారీ వర్షం కురిసే అవకాశముంది. అదే సమయంలో తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో రానున్న 48 గంటలు పగటి ఉష్ణోగ్రతలు 7 డిగ్రీల వరకు పెరిగే అవకాశముంది. రాజధాని నగరంలో చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం కొంత మేఘావృతంగా ఉంటూ సాయంత్రం, రాత్రి వేళల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. పగటి ఉష్ణోగ్రత 38, రాత్రి ఉష్ణోగ్రతలు 28-29 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

25న ఎంపీగా కమల్ ప్రమాణ స్వీకారం


ఎంఎన్‌ఎం అధ్యక్షుడు కమల్ హాసన్

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షుడు కమల్ హాసన్ ఈ నెల 25న రాజ్యసభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్రం నుంచి రాజ్యసభ ఎంపీలుగా డీఎంకే తరఫున పి.విల్సన్, రచయిత సల్మా, శివలింగం, ఎంఎన్ఎం అధ్యక్షుడు కమల్ హాసన్ తదితరులు, అన్నాడీఎంకే తరఫున ధనపాల్, ఐఎస్ ఇన్బదురై తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయిన విషయం తెలిసిందే.. ఈ మేరకు కమల్ హాసన్, డీఎంకేకు చెందిన ముగ్గురు రాజ్యసభ ఎంపీలు ఈ నెల 25వ తేది పదవీ ప్రమాణం చేయనున్నట్లు వార్తలు వెలువడ్డాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈ నెల 21నుంచి ప్రారంభం అవుతున్న విషయం తెలిసిందే.


ఎగ్మూరు ప్రెసిడెన్సీ బాలికల మహోన్నత పాఠశాలలో తనిఖీ చేస్తున్న టీఎన్‌పీఎస్సీ చైర్మన్ ఎస్కే ప్రభాకర్

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-4 పరీక్షలు

చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా టీఎన్‌పీఎస్సీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గ్రూప్-4 పరీక్షలు ప్రశాతంగా ముగిశాయి. గ్రామ నిర్వహణాధికారి, జూనియర్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్, సర్వేయర్ తదితర పోస్టుల భర్తీ కోసం ఈ పరీక్షలను నిర్వహించారు. 3935 పోస్టులకు 13.89 లక్షలమంది ఈ పరీక్షలకు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 4922 పరీక్షా కేంద్రాల్లో శనివారం ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరిగింది. రాజధాని నగరం చెన్నైలో 312 పరీక్షా కేంద్రాల్లో 94,848 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. పరీక్ష రాసేందుకు అభ్యర్థులంతా అరగంట ముందుగా అంటే ఉదయం 9 గంటల కల్లా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా విల్లుపురం జిల్లా ఓమండూరులోని ఓ పరీక్ష కేంద్రంలో 15 మంది అభ్యర్థులు ఆలస్యంగా వచ్చారు. దీంతో అధికారులు వారిని అనుమతించలేదు. అధికారులతో అభ్యర్థులు గొడవపడి పరీక్ష కేంద్రం ముందున్న రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో జరిపారు. పోలీసులు జోక్యం చేసుకుని వారిని అక్కడి నుంచి తొలగించారు. ఇదే విధంగా పాళయంకోట పరీక్ష కేంద్రంలో ఉదయం 9.05 గంటలకు చేరుకున్న అభ్యర్థులను పరీక్ష రాయడానికి అధికారులు అనుమతించలేదు. దీంతో వారు కంటతడిపెట్టుకుని తిరుగుముఖం పట్టారు. తిరుచ్చి, దిండుగల్, ఈరోడ్, అంబూరు ప్రాంతాల్లోనూ పది నిమిషాలు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను కూడా అధికారులు తిప్పిపంపారు.


చెన్నైలోని ఓ కేంద్రంలో పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

3 నెలల్లో ఫలితాలు...

గ్రూప్-4 పరీక్షల ఫలితాలు మూడు నెలల్లోగా ప్రకటిస్తామని టీఎన్‌పీఎస్సీ అధ్యక్షుడు ఎస్కే ప్రభాకర్ తెలిపారు. ఎగ్మూరు గెంగురెడ్డి వీధిలోని ప్రెసిడెన్సీ బాలికల మహోన్నత పాఠశాలలో గ్రూప్-4 పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ఈ పరీక్షలు నిర్వహించామని, అభ్యర్థులకు సమయ పాలన చాలా ముఖ్యమని పరీక్షకు అరగంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని తాము విజ్ఞప్తి చేశామని, అయినా కొన్ని చోట్ల పావుగంట ఆలస్యంగా వచ్చి కొందరు వెనుదిరిగినట్లు సమాచారం అందిందని చెప్పారు. గ్రూప్-4 పరీక్షలకు ప్రశ్నపత్రాలను తయారుచేసే కమిటీ సభ్యులకు కూడా ఈ సారి కొన్ని ఆంక్షలు విధించినట్లు తెలిపారు. కుల, మత, రాజకీయ సంబంధమైన ప్రశ్నలు ఉండకూడదని తెలిపామని చెప్పారు. ఒకవేళ ఇలాంటి ప్రశ్నలు పొందుపరిచే సభ్యులను కమిటీ నుండి తొలగిస్తామని చెప్పారు.

తిరుప్పరంకుండ్రం కుంభాభిషేకానికి ఏర్పాట్లు


చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మదురై సమీపం తిరుప్పరంకుండ్రం మురుగన్ ఆలయంలో మహాకుంభాభిషేకం నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ ఆలయ మహాకుంభాభిషేక వేడుకలు సోమవారం ఉదయం జరుగనున్నాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం యాగశాల పూజలు జరిగాయి. యాగశాలలో 150 మంది శివాచార్యులు, 85 మంది ఓదువార్లు (తమిళ శివకీర్తనలు ఆలాపించే వారు) తమిళ వేదపారాయణం చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం చతుర్థకాల యాగశాల పూజలు, సాయంత్రం పంచమకాల యాగశాల పూజలు జరిగాయి.ఆదివారం ఉదయం, సాయంత్రం 6, 7 కాలాల యాగశాల పూజలు జరుగనున్నాయి. సోమవారం ఉదయం వేకువజాము 5.25 గంటలకు 125 అడుగుల రాజగోపుర కలశాలపై పవిత్ర నదీజలాలతో సంప్రోక్షణ చేయనున్నారు. మహాకుంభాభిషేకం కోసం దేవాదాయ శాఖ రూ.2.37 కోట్లు కేటాయించి జీర్ణోద్ధరణ పనులను చేపట్టింది.

14న స్థానిక సెలవు.. : తిరుప్పరంకుండ్రం సుబ్రహ్మణ్యస్వామి ఆలయ మహాకుంభాభిషేకం జరుగనుండటంతో ఈ నెల 14న ఆ తాలూకా అంతటికి స్థానిక సెలవు ప్రకటిస్తూ మదురై జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వు జారీ చేశారు. ఈ సెలవుదినానికి బదులుగా వచ్చే 19వ తేదీ శనివారం ఆ తాలూకాలో పాఠశాలలు తదితర విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాయాలు పనిచేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఆలయ కొలనులో మునిగి

ముగ్గురు చిన్నారుల మృతి

● సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి


కొలనులో మునిగి మృతి చెందిన బాలురు

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తంజావూరు సమీపంలోని ఓ కొలనులో స్నానానికి వెళ్ళిన ముగ్గురు బాలురు నీటమునిగి దుర్మరణం చెందారు. వివరాలిలా... తంజావూరు మరుదకుడి గ్రామంలోని ఆలయ వేడుకలకు మాధవన్ (10), బాలమురుగన్ (10), జశ్వంత్ (8) అనే ముగ్గురు బాలురు వారి తల్లిదండ్రులతో కలిసి వెళ్ళారు. కుటుంబ సభ్యులంతా ఆలయంలో పూజలు చేయిస్తుండగా ఈ ముగ్గురు బాలురు అక్కడికి సమీపంలోని కొలనులో స్నానం చేయడానికి వెళ్ళారు. మొదట ఒడ్డున స్నానం చేసిన ఆ బాలురు లోతైన ప్రాంతానికి వెళ్లి ఈత రాక మునిగిపోయారు. తమ పిల్లలు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు గాభరాపడుతూ వెతికారు. చివరగా కొలనుగట్టున పిల్లల బట్టలు ఉండడంతో వెంటనే ఈత వచ్చిన కొందరు వ్యక్తులు కొలనులో దిగి, గాలించి, అపస్మారక స్థితిలో ఉన్న పిల్లలను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు చాలాసేపటి క్రితమే వారు మృతి చెందినట్లు తెలిపారు. ఒకే సమయంలో ముగ్గురు చిన్నారులు నీట మునిగి దుర్మరణం చెందటంతో వారి తల్లిదండ్రులు, కుటుంబీకులు శోకసంద్రమయ్యారు.

సీఎం స్టాలిన్ సంతాపం...

తంజావూరు జిల్లా మరుదక్కుడి గ్రామంలో ఊరణికుళం ఆలయ కొలనులో దిగి ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుసుకుని దిగ్భ్రాంతి చెందానని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. పిల్లలను కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. అదే సమయంలో ప్రభుత్వం తరఫున ముగ్గురి కుటుంబాలకు సీఎం రూ.3లక్షల చొప్పున ఆర్థికసాయం ప్రకటించారు.

సమాచార దర్శిని

15,17 తేదీల్లో చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి మధ్య సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-గూడూరు సెక్షన్‌లోని గుమ్మిడిపూండి-పొన్నేరి రైల్వేస్టేషన్ మధ్య పలు రైళ్లు రద్దు చేశారు. రైలు మార్గాల్లో మరమ్మతుల కారణంగా ఈ నెల 15,17 తేదీల్లో చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి మధ్య ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 3.15 గంటల వరకు 25 సబర్బన్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. ఆ సమయంలో ప్రయాణికుల సౌకర్యార్థం మూర్ మార్కెట్ కాంప్లెక్స్, చెన్నై బీచ్ రైల్వేస్టేషన్ల నుంచి పొన్నేరి, మీంజూరుకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.

పీజీ టీచర్ల పరీక్ష వాయిదా

టి.నగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పీజీ టీచర్ల కోసం సెప్టెంబర్ 28న జరుపతలపెట్టిన పరీక్ష వాయిదా వేసినట్లు టీచర్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించింది. పీజీ టీచర్లు, వ్యాయామ సంచాలకులు, కంప్యూటర్ ట్రైనర్ సహా 1996 పోస్టులను భర్తీ చేయనున్నట్లు బోర్డు పేర్కొంది. ఈ పరీక్షలకు సంబంధించి ఆగస్టు 12 వరకు దరఖాస్తులను స్వీకరించి, పరీక్షలు సెప్టెంబర్ 28న నిర్వహించనున్నట్లు కూడా ప్రకటించింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 28న టీఎన్‌పీఎస్సీ గ్రూప్-2, గ్రూప్-2ఎ పరీక్షలు జరుగనుండటంతో పీజీ టీచర్ల ఎంపిక పరీక్ష వాయిదా వేసినట్లు టీచర్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులు తెలిపారు.

'ఏకతాటిపై తమిళనాడు' 77.34 లక్షల మంది సభ్యుల చేరిక

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): 'ఏకతాటిపై తమిళనాడు' ఉద్యమం ద్వారా డీఎంకేలో 77,34,937 మంది చేరారు. ఈ ఉద్యమం ద్వారా 49,11,090 మంది కొత్త సభ్యులుగా చేరారని, అత్యధికంగా కరూర్‌లో 41 శాతం మంది పార్టీలో చేరారని డీఎంకే ప్రధాన కార్యాలయం తెలియజేసింది.

జాలర్ల మహిళలకు రుణాలు

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జాలర్ల మహిళల జీవనాధారం మెరుగుపరిచేలా 'అలైగళ్' పథకం ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం, రూ.25 కోట్లు కేటాయించింది. ఈ పథకంలో జాలరి కుటుంబాల మహిళలను ఎంపిక చేసి, వారు సముద్రపు నాచు, చేపల పెంపకం తదితరాలకు తలా రూ.50వేల వరకు రుణం అందజేయనున్నట్లు పశు సంవర్థక శాఖ కార్యదర్శి సుబ్బయ్యన్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉన్నత విద్యలో పెరిగిన విద్యార్థినుల సంఖ్య

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యలో చేరే విద్యార్థినుల సంఖ్య 31 శాతానికి పెరిగిందని ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ తెలిపారు. నగరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కలైంజర్ కరుణానిధి చూపిన బాటలో ముఖ్యమంత్రి స్టాలిన్ పాలన మైనార్టీ సమాజానికి సురక్షితమైనదిగా మారిందన్నారు. ఉన్నత విద్యలో విద్యార్థినుల సంఖ్య పెంచేలా 'పుదుమై పెన్' పథకం ప్రారంభించారని, ప్రస్తుతం ఉన్నత విద్యలో చేరుతున్న విద్యార్థినుల సంఖ్య 31 శాతానికి పెరిగిందని మంత్రి తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభం

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉద్యోగుల కొరత కారణంగా మూసివేసిన అంగన్‌వాడీ కేంద్రాలు తిరిగి ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా 54,483 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, తగినంత మంది సిబ్బంది లేకపోవడం, పిల్లలను పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపకపోవడంతో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 501 అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడ్డాయి. ఈ విషయమై సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతా జీవన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో అంగన్వాడీ కేంద్రాలు మూసివేసే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, నగరంలో మూసివేసిన 147 సహా 501 అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్తగా ఎంపిక చేయనున్న ఉద్యోగులను ఈ కేంద్రాల్లో నియమించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆన్‌లైన్‌లో సహకార సంఘాల ఉత్పత్తులు

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు తయారుచేస్తున్న ఉత్పత్తులు ఇళ్ల వద్దకే అందించేలా సహకార శాఖ చర్యలు చేపట్టింది. సహకార సంఘాలు తయారుచేస్తున్న ఉత్పత్తులు అముదం, సహకార సంఘాల దుకాణాల ద్వారా విక్రయిస్తున్నారు. ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న కాలంలో నగర ప్రజలు అధికంగా ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ఈ విషయమై దృష్టి సారించిన సహకార శాఖ, తమ ఉత్పత్తులు కూడా ఆన్‌లైన్‌లో ఆర్డర్లు పొంది వినియోగదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందించేలా చర్యలు చేపట్టింది. ఈ విషయమై ఈ కామర్స్ సంస్థలతో చర్చలు జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

టీవీకేలో 2 కోట్ల మందిని చేర్చేలా యాప్

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రెండు కోట్ల మందిని సభ్యులుగా చేర్చేలా, కొత్త మొబైల్ యాప్‌ను తమిళగ వెట్రి కళగం (టీవీకే) పరిచయం చేసింది. నటుడు విజయ్ ప్రారంభించిన టీవీకే పార్టీలో 2 కోట్ల మందిని సభ్యులుగా చేర్చాలని నిర్ణయించారు. అందుకోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్ రూపొందించారు. ఈ యాప్ ద్వారా సభ్యులను చేర్చే ప్రక్రియపై పార్టీ సాంకేతిక విభాగం కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ యాప్‌ను త్వరలో పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రారంభిస్తారని, ఆ సమయంలో రాష్ట్ర వ్యాప్త పర్యటనపై విజయ్ అధికారికంగా ప్రకటిస్తారని ఆ పార్టీ శ్రేణులు తెలిపారు.

మద్యం తాగొద్దన్నారని ఎయిర్‌గన్‌తో కాల్పులు

● తాగుబోతు భర్త అరెస్టు

అడయార్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఇంటిలో మద్యం తాగొద్దన్న భార్యతో పాటు కన్నతల్లి, సోదరుడిపై తాగుబోతు భర్త.. ఎయిర్ గన్‌తో కాల్పులు జరిపాడు. ఆ కాల్పుల్లో గాయపడిన ముగ్గురిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసుల కథనం మేరకు... విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపంలోని వాగ్గూరు అనే గ్రామానికి చెందిన రామచంద్రన్ (65), ఆయన భార్య పచ్చయమ్మాళ్ (60) దంపతులకు తెన్నరసు (34) అనే కుమారుడున్నాడు. ఈయనకు గత నెలలో లావణ్య అనే మహిళతో వివాహం జరిగింది. అయితే, తెన్నరసుకు మద్యం సేవించే అలవాటు ఉంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తెన్నరసు ఇంటిలోనే మద్యం సేవించడం గమనించిన భార్య మందలించడంతో భార్యాభర్తల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం జరిగింది. దీంతో తెన్నరసు గతంలో కొనుగోలు చేసిన ఎయిర్ గన్‌తో భార్యపై కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఆమె గాయపడ్డారు. కాల్పుల శబ్దం విన్న తల్లి పచ్చయమ్మాళ్ వచ్చి కుమారుడిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా ఆమెపై కూడా కాల్పులు జరిపాడు. ఇంతలో పక్కింటిలో ఉండే పినతండ్రి కుమారుడు భరత్ (26) వచ్చి తెన్నరసును పట్టుకునేందుకు ప్రయత్నించగా, అతనిపై కూడా కాల్పులు జరిపాడు. ఇంతలో ఇరుగు పొరుగు వారంతా రావడంతో భయపడిపోయిన తెన్నరసు ఇంటినుంచి పారిపోయాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని, అంబులెన్స్‌లో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. అలాగే పొదల్లో దాగివున్న తెన్నరసును కూడా అరెస్టు చేశారు.

'ప' ఆకారంలో సీటింగ్

● విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం మెరుగుపరిచేందుకు చర్యలు

● మంత్రి అన్బిల్ మహేష్


'ప' ఆకారంలో కూర్చున్న విద్యార్థులు (ఫైల్‌ఫొటో) (అంతర్ చిత్రంలో) మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి పాఠశాలల్లో 'ప' ఆకారంతో సీటు సదుపాయం ఏర్పాటుచేస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. పాఠశాల తరగతి గదిలో విద్యార్థులు కూర్చునే సీట్లు మార్చాలని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కన్నప్పన్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ విధానం ద్వారా విద్యార్థులు విద్యాభ్యాసంలో ఆసక్తి పెరుగుతుందని ఆయన సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఆ ప్రకారం, 'ప' (తమిళ అక్షరం) నమూనాలో పాఠశాలల్లో సీట్లు వేయనున్నారు. ఈ విషయమై ఆ శాఖ మంత్రి అన్బిల్ మహేష్ మాట్లాడుతూ... అందరూ సమానమనే విషయం పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు తెలుసుకొనేలా ఈ మార్పు చేపట్టామన్నారు. ఆ ప్రకారం, తరగతి గదుల్లో ముందు , వెనుక అనే తారతమ్యం ఉండదని తెలిపారు. తొలివిడతగా అన్ని పాఠశాల్లోని ఓ తరగతి గదిలో ప్రయోగాత్మకంగా 'ప' ఆకారంలో ఏర్పాటుచేసిన సీట్లలో విద్యార్థులు కూర్చొనేలా చర్యలు చేపట్టామని, అలా చేయడం వల్ల కలిగే లాభనష్టాలు అంచనా వేసి, తదనుగుణంగా అన్ని తరగతిలో గదుల్లో ఈ పద్ధతి అనుసరించాలా? వద్దా? అనే విషయమై నిర్ణయం తీసుకుంటామని మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు.

విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

శ్రీపురం నారాయణి పీఠం శక్తిఅమ్మ

వేలూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తిరుమలై శ్రీకోటి నారాయణి సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థుల అధ్యక్ష పదవీ స్వీకారోత్సవ కార్యక్రమం శనివారం నారాయణి పీఠం, పాఠశాల డైరెక్టర్ డా.రమేష్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీశక్తి అమ్మ పాల్గొని నూతన విద్యార్థుల కమిటీకి శుభాకాంక్షలు తెలిపి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులంతా శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు.

కావేరి హాస్పిటల్‌లో 13 యేళ్లబాలుడికి రెండోసారి కిడ్నీమార్పిడి

చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్‌లో 13 యేళ్లబాలుడికి రెండోసారి మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు చీఫ్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఆర్.బాలసుబ్రమణియం తెలిపారు. డాక్టర్ బాలాజీ కృష్ణన్, డాక్టర్ స్వామినాథన్ సంబంధం, డాక్టర్ అను రమేష్, డాక్టర్ వేల్‌మురుగన్ దేశింగ్ తదితర వైద్య బృందం ఈ శస్త్రచికిత్స జరిపినట్లు ఆయన చెప్పారు. ఆరేళ్ల వయస్సులో ఆ బాలుడికి తొలి మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స జరిగిందని, అతడి తల్లి దానంగా ఇచ్చిన మూత్రపిండాన్ని అతడికి అమర్చారని, ఇటీవల ఆ మూత్రపిండం చెడిపోవటంతో తీవ్ర అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. ప్రస్తుతం అతడి తండ్రి దానంగా ఇచ్చిన మూత్రపిండంతో ఆపరేషన్ చేసినట్లు వివరించారు. ఆ బాలుడి రక్తం, కిడ్నీని దానం చేసిన తండ్రి రక్తం వేర్వేరుగా ఉండటంతో రక్తంలో ప్లాస్మాలను తొలగించి, ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తిచేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఆ బాలుడు సంపూర్ణంగా కోలుకున్నాడని తెలిపారు.

డీఎంకే కూటమిని ఇంటికి సాగనంపుతాం

● బీజేపీ ధర్నాలో నయినార్ నగేంద్రన్


ధర్నాలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

ప్యారీస్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమిని ఇంటికి సాగనంపుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ పేర్కొన్నారు. మదురై కార్పొరేషన్‌లో పన్ను తగ్గింపు పేరిట జరిగిన రూ.200 కోట్ల అవినీతికి సంబంధించి మేయర్ ఇంద్రాణి పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం మదురైలో నయినార్ నాగేంద్రన్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో బీజేపీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ధర్నాలో నయినార్ నాగేంద్రన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అవినీతి పాలనను నిలదీస్తూ మదురై గడ్డపై నిర్వహించిన ఈ ధర్నా తప్పనిసరిగా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమిని ఇంటికి సాగనంపుతుందని నమ్మకం వ్యక్తం చేశారు.

సంరక్షణ కేంద్రంలో బాలికలకు లైంగిక వేధింపులు

● ముగ్గురి అరెస్టు

అడయార్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతం వండలూరు సమీపంలోని ఓ సంరక్షణా కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న కొంతమంది బాలికలను లైంగికంగా వేధించిన కేసులో సంరక్షణా కేంద్రం యజమాని సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే, వండలూరుకు సమీపంలో ప్రైవేటు సంరక్షణా కేంద్రం 15 యేళ్ళకు పైగా నడుస్తోంది. ఇక్కడ 30 మందికిపైగా బాలికలు ఆశ్రయం పొందుతున్నారు. అయితే, ఈ కేంద్రంలో ఆశ్రయం పొందే బాలికల్లో కొందరిని కేంద్రం యజమానితో పాటు మరో ఇద్దరు సిబ్బంది లైంగికంగా వేధించినట్టు ఆరోపణలు వచ్చాయి. దీనిపై వండలూరు ఆల్ ఉమెన్స్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ విచారణలో సంరక్షణా కేంద్రం యజమాని అరుల్‌దాస్, ఉద్యోగి ప్రియ, కారు డ్రైవర్ పళనిలపై కేసు నమోదు చేసి, వారిని అరెస్టు చేశారు.

ఆదాయానికి మించి రూ.2.73 కోట్ల ఆస్తులు

● మున్సిపల్ కమిషనర్‌పై కేసు నమోదు

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి అధికంగా రూ.2.73 కోట్ల ఆస్తులు కూడబెట్టారంటూ తేని మున్సిపల్ కమిషనర్ ఏకరాజ్ (58), ఆయన భార్య ఫ్లారెన్స్‌లపై చెన్నై అవినీతి నిరోధక శాఖ అధికారులు కేసు నమోదుచేశారు. పోరూర్ అయ్యప్పన్‌తాంగళ్‌కు చెందిన ఏకరాజ్, తేని మున్సిపల్ కమిషనర్‌గా 10 నెలలుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన మెడికల్ లీవ్‌లో ఉన్నారు. ఆయన భార్య ఫ్లారెన్స్ మధురవాయల్ డా.ఎంజీఆర్ విద్య పరిశోధన కేంద్రంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. 2019-24 వరకు ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న ఏకరాజ్, ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని ఫిర్యాదులున్నాయి. ఈ వ్యవహారంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఈ నెల 1,3 తేదీల్లో తేనిలో ఆయన నివసిస్తున్న ప్రభుత్వ క్వార్టర్స్‌లోని ఇంట్లో తనిఖీలు చేసి, కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. కానీ, ఏకరాజ్ జూన్ 26 నుంచి ఈ నెల 10వ తేది వరకు మెడికల్ లీవు తీసుకున్నారు. ఈ క్రమంలో తనిఖీల్లో లభించిన ఆధారాల ఆధారంగా, ప్రస్తుతం ఏకరాజ్ రూ.2 కోట్ల 73 లక్షల, 53 వేలు ఆస్తులు కలిగి ఉన్నారు. కానీ, 2019-24 వరకు ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న ఏకరాజ్ రూ. కోటి 33 లక్షల 60 వేలు ఆస్తులు మాత్రమే ఉన్నాయని, ఆ ప్రకారం ఆయన ఆదాయం 205 శాతం పెరిగిందని తెలిసింది. దీంతో, ఏకరాజ్, ఆయన భార్యపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

ఘనంగా గంగమ్మ క్షీరకలశాల ఊరేగింపు


క్షీరకలశాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్తున్న నిర్వాహకులు - క్షీరకలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

వేలూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తం సమీపంలోని ధర్మ్‌పేట గంగమ్మ జాతర ఘనంగా జరుగుతోంది. జాతరను పురస్కరించుకుని శనివారం ఉదయం మహిళలు అమ్మవారి కంకణధారణ చేసి, వ్రతమాచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఢమరుక ధ్వనులతో దీపారాధన చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో 1001 పాల కలశాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్ళారు. అర్చకుల వేదమంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ క్షీరకలశాల ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. ఈ కార్యక్రమంలో గ్రామపెద్ద ఆర్‌జీఎస్ సంపత్, ఆలయ ధర్మకర్త పిచ్చాండి, కమిటీ అధ్యక్షుడు కార్తికేయన్ తదితరులు పాల్గొని, భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

స్టెరిలైట్ కర్మాగారాన్ని పునః ప్రారంభించాలి


కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన పరిశ్రమల సమాఖ్య సభ్యులు

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్టెరిలైట్ కర్మాగారం మళ్లీ ప్రారంభించి, పర్యావరణ రహిత పద్ధతిలో రాగి ఉత్పత్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతూ పరిశ్రమ సమాఖ్య జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. తూత్తుకుడి ప్రజల జీవానాధార సంస్థ అధ్యక్షుడు త్యాగరాజన్, కార్యదర్శి గణేశన్ నేతృత్వంలో పరిశ్రమ సమాఖ్య సభ్యులు శనివారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్టెరిలైట్ రాగి కర్మాగారాన్ని పర్యావరణ పరిరక్షణ ప్రాతిపదికన పునఃప్రారంభించేందుకు పర్యావరణ పురస్కార గ్రహీత గణపతి, మాజీ పర్యావరణ ప్రొఫెసర్ డా.నాగేంద్రన్ పలు సిఫారులు చేశారన్నారు. ఆ ప్రకారం, కర్మాగారం నుంచి విడుదల అయ్యే వ్యర్థాలు నీరు, భూమి, గాలిని కలుషితం చేయకుండా శాస్త్రీయ పద్ధతులను వినియోగించేలా పరికరాలు మార్చి తిరిగి తెరిచేందుకు అవకాశముంటుందని తెలిపారు. అలాగే, కర్మాగారం ప్రారంభిస్తే యువతకు జీవనోపాధి లభిస్తుందని వారు పేర్కొన్నారు.

ఇంటింటికీ తిరుచెందూర్ ఆలయ ప్రసాదం


ప్రసాదం సంచి అందజేస్తున్న ఉద్యోగులు

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ ఆలయ కుంభాభిషేకం ముగిసిన నేపథ్యంలో ఆలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి ప్రసాదం అందిస్తున్నారు.. తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయ కుంభాభిషేకం ఈ నెల 7వ తేది నిర్వహించగా, పొరుగు జిల్లాలు, రాష్ట్రాలు, విదేశాలకు చెందిన సుమారు 5 లక్షల మంది భక్తులు పాల్గొన్నారు. కుంభాభిషేకం ముగిసినా ఆలయానికి వేలాది మంది వస్తున్నారు. కుంభాభాషేకం సందర్భంగా లక్ష ప్రసాదం సంచులను ఆలయ అధికారులు సిద్ధం చేశారు. పవిత్ర జలం, పళని నుంచి తీసుకువచ్చిన మూలికా విభూది, తిరుచెందూర్ మురగన్ ఫొటో, కుంకుమ, విభూది, లడ్డూతో కూడిన సంచిని భక్తులకు అందజేశారు. ప్రస్తుతం తిరుచెందూర్ నగరంలోని 20వేల ఇళ్లకు ఆలయ ఉద్యోగులు వెళ్లి ప్రసాదంతో కూడిన సంచులను అందజేస్తున్నారు.

కాలువల నిర్మాణానికి భూమిపూజ


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అమ్ములు తదితరులు

వేలూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తం 24వ వార్డులో రూ.14 లక్షలతో నూతన కాలువల నిర్మాణం పనులకు శనివారం ఉదయం ఎమ్మెల్యే అమ్ములు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం వివిధ పథకాలను ప్రవేశపెడుతోందని, అదేవిధంగా గుడియాత్తం పరిధిలోని పలు వార్డుల్లో డ్రైనేజీ, పంటకాలువ నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సౌందరరాజన్, యూనియన్ ప్రధాన కార్యదర్శి కల్లూరు రవి పాల్గొన్నారు.

పెళ్ళయిన రెండోరోజే నగలతో వధువు పరారీ

● దిగులుతో వరుడి ఆత్మహత్య


శివషణ్ముగం, దీపా

చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా పరమత్తి వేలూరు తాలూకా వడకరయాత్తూరు ప్రాంతంలో పెళ్ళయిన రెండోరోజు వధువు నగలతో పారిపోయింది. ఆ మరుసటి రోజే వరుడు దిగులుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వడకరయాత్తూరుకు చెందిన శివషణ్ముగం (35) కొన్నేళ్ళ క్రితం వివాహం కాగా, భార్య విడాకులు తీసుకుంది. ఈ నేపథ్యంలో శివషణ్ముగం వివాహ ప్రయత్నాలు ప్రారంభించాడు. బ్రోకర్ల ద్వారా విరుదునగర్ జిల్లా ఆలంపట్టి మారియమ్మన్ కోవిల్ ప్రాంతానికి చెందిన చిన్నసామి కుమార్తె దీపా (30) అనే యువతిని ఈ నెల 7న మదురై మాట్టుతావనిలోని ఓ ఆలయంలో వివాహం చేసుకున్నాడు. ఈ వివాహానికి దీపా కుటుంబసభ్యులు ఎవరూ హాజరుకాలేదు. ఈ పెళ్ళి కుదుర్చిన బ్రోకర్లకు శివషణ్ముగం లక్షరూపాయలను కమిషన్ ఇచ్చాడు. దీపాకు వరకట్నంగా లక్షరూపాయలు, కొన్ని నగలు ఇచ్చాడు. ఆ తర్వాత ఈ నెల ఎనిమిదిన శివషణ్ముగం దిడుమల్ రాసంపాళయంలోని తన అక్కగారింటికి భార్యతో కలిసి వెళ్ళాడు. అక్కగారింట జరిగిన విందు వేడుకల్లో పాల్గొని రాత్రి అక్కడే ఉన్నారు. మరుసటి రోజు లేచి చూడగా దీపా కనిపించలేదు. దీప సెల్‌ఫోన్, వివాహ బ్రోకర్ల ఫోన్ పనిచేయలేదు. చివరకు దీప తనను మోసగించినట్లు తెలుసుకుని శివషణ్ముగం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దీప, బ్రోకర్ల ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

రైల్వే గేటును ఢీకొన్న లారీ

● రైళ్ల రాకపోకలకు అంతరాయం

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రైల్వే గేట్‌ను లారీ ఢీకొనడంతో రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. శివగంగ జిల్లా కల్‌కుర్చిలో మూసి ఉన్న రైల్వే గేటును లారీ ఢీకొనడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో, ఆ మార్గంగా వెళ్లాల్సిన తిరుచ్చి-విరుదునగర్ ప్యాసింజర్ రైలు, రామేశ్వరం-చెన్నై సూపర్ ఫాస్ట్ రైళ్లు నిలిచిపోయాయి. రైల్వే కార్మికులు అక్కడకు చేరుకుని మరమ్మతులు చేపట్టడంతో గంట ఆలస్యంగా రైళ్లు బయల్దేరి వెళ్లాయి. లారీ ఢీకొనడంతో, రైల్వే గేటు కమ్మీ ఎగిరి విద్యుత్ వైరుపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని రైల్వే అధికారులు తెలిపారు.

ఆర్థిక మోసాలకు పాల్పడే వారిపై గూండా చట్టం

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంస్థల పేరుతో మోసాలకు పాల్పడితే గూండా చట్టం కింద చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మోసానికి గురైన బాధితులకు సత్వర ఉపశమనం లభించేలా చర్యలు చేపట్టనున్నట్లు, ఆర్థిక సంస్థల మోసాలు, ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేలా ఒక ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది.

● వాచ్‌మన్ మృతి వ్యవహారం...

దర్యాప్తు ప్రారంభించిన సీబీఐ

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తిరుభువనం ఆలయ వాచ్‌మన్ మృతి వ్యవహారంపై సీబీఐ విచారణ ప్రారంభించింది. శివగంగ జిల్లా తిరుభువనం సమీపంలోని కాళి ఆలయ వాచ్‌మన్ అజిత్‌కుమార్‌ను నగల చోరీ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టిన సమయంలో, అతడు మృతిచెందాడు. ఈ వ్యహారంపై మదురై జిల్లా న్యాయమూర్తి జాన్ సుందర్‌లాల్ సురేష్‌ను విచారణాధికారిగా హైకోర్టు మదురై బెంచ్ నియమించింది. ఆయన నాలుగు రోజులు విచారణ చేపట్టి ఈ నెల 8వ తేది నివేదికను హైకోర్టులో దాఖలుచేశారు. ఈ నేపథ్యంలో, ఈ కేసు విచారణ సీబీఐకి బదిలీ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో, సీబీఐ విచారణ పూర్తిచేసి ఆగస్టు 20వ తేది ఛార్జీషీటు దాఖలుచేయాలని హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. అజిత్‌కుమార్ మృతిపై కేసు నమోదుచేసిన సీబీఐ, రాష్ట్ర పోలీసుల నుంచి కేసుకు సంబంధించి వివరాలు తీసుకుని విచారణ ప్రారంభించారు.

వ్యభిచారం కేసులో ముగ్గురి అరెస్ట్

వేలూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కట్పాడి సమీపంలోని విరుధంపట్టి ప్రాంతంలో కళాశాల విద్యార్థులే టార్గెట్‌గా వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు, వివరాల్లోకి వెళ్తే వేలూరు ముత్తుమండపంకు చెందిన ప్రశాంత్, అనైకట్టు కొళ్లైమేడుకు చెందిన రామ్‌కుమార్, అప్పు అనే ముగ్గురు యువకులు విరుధంపట్టి ప్రాంతంలో కొంత మంది మహిళలతో ఇంట్లోనే వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో నిఘా వేసిన పోలీసులు ఆ ముగ్గురి అరెస్టు చేశారు. అనంతరం వేలూరు కోర్టు ఉత్తర్వుల మేరకు జైలుకు తరలించారు.

గూడలూరులో ఏనుగుల సంచారం


గూడలూరు పంపొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా గూడలూరు ప్రాంతంలో ఒకేసారి మూడు ఏనుగులు సంచరిస్తుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. తొలుత ఓ ఏనుగు మేల్ గూడలూరు, కెవిప్పారా, హెల్‌కెంప, సెమ్మాలా, కొత్తర్ వలయ తదితర ప్రాంతాల్లో సంచరిస్తుండేది. పగటి పూట ఎవరి కంటపడకుండా విశ్రాంతి తీసుకునే ఆ ఏనుగు సాయంత్రమైతే జనావాస ప్రాంతాల్లో సంచరిస్తుండేది. ప్రస్తుతం ఈ ఏనుగుకు తోడుగా మరో రెండు ఏనుగులు చేరాయి. ఈ ఏనుగులు కూడలూరు - ముదుమలై సరిహద్దు గ్రామాలైన తోరాపల్లి, ఎచ్చం వయల్, కునిల్ వయల్, తేన్‌వయల్ తదితర ప్రాంతాల్లో రాత్రిపూట సంచరిస్తున్నాయి. దీంతో స్థానికులు సాయంత్రానికే ఇళ్లకు చేరుకుని తలుపులు గడియపెట్టుకుంటున్నారు. ఆ ఏనుగులు ఇళ్ళ వద్ద తినడానికి తినుబండారాలు లేకపోవడంతో ఆగ్రహంతో అక్కడి వస్తువులను ధ్వంసంచేస్తున్నాయి. పొలాల్లో చొరబడి పంటలను నాశనం చేస్తున్నాయి. ఈ ఏనుగుల బారి నుండి తమను కాపాడాలంటూ అధికారులకు స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'మీతో స్టాలిన్'

● ఇంటింటికీ వెళ్ళి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్


వినతిపత్రాలు అందుకుంటున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడిలో శనివారం ఉదయం 'మీతో స్టాలిన్' కార్యక్రమాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాట్పాడిలోని వివి.నగర్‌లో ఆమె ఇంటింటికీ వెళ్ళి ప్రజలనుండి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సెంథిల్‌కుమార్, పంచాయతీ అసిస్టెంట్ డైరెక్టర్ తిరుపాల్, అభివృద్ధి అధికారి కనకరాజ్, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోటారు పంప్ రూమ్‌పై సేదదీరిన చిరుతలు



చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మోటరు పంప్ రూమ్‌పై చిరుత పులలను గమనించిన గ్రామస్తులు భయాందోళనలకు గురయ్యారు. నీలగిరి జిల్లా కున్నూరు పేరట్టి పంచాయతి పరిధిలోని గ్రామాలకు మోటారు ద్వారా నీరందిస్తున్నారు. ఈ మోటారు రూమ్‌పై శనివారం ఉదయం రెండు చిరుతలు సేదతీరుతుండడాన్ని ఆ ప్రాంత ప్రజలు గమనించి, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ప్రజల అలికిడి గమనించిన చిరుతలు కొద్దిసేపటి తర్వాత సమీపంలోని అడవుల్లోకి వెళ్లాయి. ప్రమాదం జరుగకముందే చిరుత పులులను బంధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గంజాయి విక్రయం కేసులో ఇద్దరికి పదేళ్ల జైలుశిక్ష

చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దిండుగల్‌లో గంజాయి విక్రయించిన కేసులో ఇద్దరికి 10 ఏళ్ల జైలు శిక్ష, తలా రూ.75వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. గోవిందాపురం ప్రాంతంలో 2022లో గంజాయి విక్రయిస్తున్న మరుదానికుళం ప్రాంతానికి చెందిన అన్నుకడవుళ్ (38), ఆర్ఎం కాలనీకి చెందిన పాండ్యరాజన్ (37)లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో విచారణ పూర్తికావడంతో మాదక ద్రవ్యాల నిరోధక ప్రత్యేక కోర్టు, పాండ్యరాజన్, అన్నుకడవుళ్‌కు తలా 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.75,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

19 నుంచి చెన్నై వ్యాపారవేత్త హత్య కేసు విచారణ


అడయార్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఒక వ్యాపారవేత్తను హత్య చేసి ఏర్కాడులో కొండగుట్టల్లో పడేసిన కేసు కీలక మలుపు తిరిగింది. ఈ కేసులో సుమారు 9 నెలల తర్వాత ఈ నెల 19వ తేదీ నుంచి విచారణ ప్రారంభంకానుంది. పట్టిణంపాక్కంకు చెందిన సెల్వవినాయగం అనే వ్యాపారవేత్త మలేసియాలో లారీ బిజినెస్ చేస్తూ అక్కడే వాణి అనే మహిళను పెళ్ళి చేసుకున్నారు. ఆయన సోదరి ధనలక్ష్మి, ఈమె భర్త రాజేంద్రన్ ఒక హోటల్ యజమాని. వ్యాపారంలో నష్టం రావడంతో సెల్వవినాయగం మాత్రమే చెన్నైకు వచ్చి రాజేంద్రన్‌కు చెందిన హోటల్‌లో బసచేశాడు. ఈ క్రమంలో ఆయన ఓ రోజున ఉన్నట్టుండి అదృశ్యంకాగా, దీనిపై సోదరి నీలాంగరైలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలోనే సెల్వవినాయగం ఏర్కాడులో శవమై కనిపించాడు. అదేసమయంలో రాజేంద్రన్ కూడా కనిపించకుడాపోయాడు. దీంతో కేసు విచారణ సీబీసీఐడీకి బదిలీ చేశారు. అయితే, గత 9 నెలలుగా ఎలాంటి పురోగతి లేకుండా ఉన్న ఈ కేసు విచారణ ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభంకానుంది.


'మదురై-16' ఆడియో రిలీజ్ దృశ్యం

థియేటర్‌కు వచ్చేందుకు పేదలు జంకుతున్నారు

● నిర్మాత కె.రాజన్

పూర్తిగా మదురై బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన చిత్రం 'మదురై-16'. ఇది పొలిటికల్ థ్రిల్లర్. జాన్ థామస్ దర్శకుడు. జెరోమ్ విజయ్ హీరోగా నటించారు. జేఎస్ ఫిలిమ్స్ పతాకంపై శ్రీదేవి చిన్నయ్య, జీన్ విలియమ్స్ నిర్మించారు. ఉత్రా ప్రొడక్షన్స్ తరఫున ఎస్.హరి ఉత్రా రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుక తాజాగా జరిగింది. ఇందులో సినీ పంపిణీదారుల సంఘం అధ్యక్షుడు కే.రాజన్, దర్శకుడు పేరరసు, చిన్న చిత్రాల నిర్మాతల సంఘం అధ్యక్షుడు అన్బుసెల్వన్, నటుడు రోబో శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ మూవీ నిర్మాత జీన్ విలియమ్స్ ప్రొఫెసర్ కాగా, దర్శకుడు జాన్ థామస్ నిర్మాత వద్ద చదువుకున్న విద్యార్థి కావడం గమనార్హం. ఇందులో కె.రాజన్ మాట్లాడుతూ, 'మహిళ నిర్మాతగా ధైర్యంగా ముందుకు వచ్చి ఈ చిత్రాన్ని నిర్మించడం అభినందనీయం. ఈ సినిమా ఖచ్చితంగా విజయం సాధిస్తుంది. హీరో విజయ్ నటుడిగా ఉండి ఇపుడు రాజకీయ నేతగా మారిపోయారు. ఇపుడు మరో విజయ్ పరిశ్రమకు వచ్చారు. ఈ విజయ్ కూడా ఆ విజయ్ స్థాయికి చేరుకుంటారని గట్టిగా నమ్ముతున్నాను. రూ.300 కోట్ల బడ్జెట్‌తో తీసే సినిమా టిక్కెట్ ధర రూ.100 నుంచి రూ.150గా నిర్ణయిస్తున్నారు. చిన్న బడ్జెట్ చిత్రాలకు కూడా ఇదే టిక్కెట్ ధర వసూలు చేస్తున్నారు. దీంతో పేదలు సినిమా థియేటర్‌కు వచ్చేందుకు భయపడుతున్నారు. చిన్న చిత్రాలకు టిక్కెట్ ధర రూ.60, రూ.80, రూ.100గా నిర్ణయించాలి. ఈ విషయంపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దృష్టిసారించాలి' అని కోరారు. నిర్మాత జీన్ విలియమ్స్ మాట్లాడుతూ, 'నన్ను ఉన్నత విద్య చదివించి, ప్రొఫెసర్‌గా చేసిన నా భార్యకు ధన్యవాదాలు. మదురై తిరుమలై నాయకర్ కాలేజీలో విద్యాభ్యాసం చేసే సమయంలో నాటకాలు వేసేవాళ్ళం. సినిమాల్లోకి రావాలన్న ఏకైక లక్ష్యంతో 2020లో ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేశాను. ఈ సినిమా కోసం అనేక మందిని సంప్రదించినా అది వర్కౌట్ కాలేదు. చివరకు నా కుమారుడునే హీరోగా చేసి సినిమా రూపొందించాం' అన్నారు.


'సరెండర్'లో దర్శన్

క్రైమ్ యాక్షన్ డ్రామాగా 'సరెండర్'

చిత్రజ్యోతి

'బిగ్ బాస్' టైటిల్ విజేత దర్శన్ హీరోగా నూతన దర్శకుడు గౌతమ్ గణపతి రూపొందించిన యాక్షన్ డ్రామా మూవీ 'సరెండర్'. ఆగస్టు ఒకటో తేదీ రిలీజ్‌కానుంది. అప్ బీట్ పిక్చర్స్ పతాకంపై నిర్మాత వీఆర్‌వీ కుమార్ నిర్మించిన ఈ చిత్రంలో దర్శన్ తన సినీ కెరీర్‌లోనే తొలిసారి యువ పోలీస్ అధికారిగా నటించారు. ప్రముఖ దర్శకుడు అరివళగన్ వద్ద సహాయకుడిగా పనిచేసిన గౌతమ్ గణపతి ఈ చిత్రం ద్వారా దర్శకుడుగా పరిచయమవుతున్నారు. దర్శన్‌తో పాటు మలయాళ నటులు లాల్, సుజిత్ శంకర్‌తో పాటు మునీష్‌కాంత్, పళనికుమార్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. ఈ చిత్ర వివరాలను దర్శకుడు వివరిస్తూ, 'ఎన్నికల పోలింగ్‌కు ఐదు రోజులకు ముందు పోలీస్ స్టేషన్ నుంచి ఒక ముఖ్యమైన వస్తువు, ఎన్నికల కోసం కంటైనర్‌లో తరలిస్తున్న నగదు కనిపించకుండా పోతుంది. ఈ రెండు గ్యాంగ్‌లు తమతమ వస్తువులను గాలిస్తూ ఒక చోట కలుసుకుంటారు. ఆ తర్వాత ఏం జరిగిందన్నదే ఈ స్టోరీ. చెన్నై, దాని పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించాం. మునీష్‌కాంత్ అమాయకుడైన పాత్రలో నటించారు. ఆయన పాత్ర ట్రావెల్‌గా ఉంటుంది. అందుకే తిరుచ్చిలో చిత్రీకరించాం. పాటలు లేవు. మంచి కథాంశంతో పాటు నటీనటుల ప్రదర్శన ఈ చిత్రానికి బలం. దర్శన్ కెరీర్‌లోనే యంగ్ పోలీస్ ఆఫీసర్‌గా నటించారు. ఈ సినిమా కోసం ముందుగానే ట్రైనింగ్ తీసుకున్నారు. ఈ చిత్రం ద్వారా దేవీశ్రీ ప్రసాద్ వద్ద సహాయకుడిగా పనిచేసిన వికాస్ బాడిసా తొలిసారి సంగీత దర్శకుడిగా పరిచయమవుతున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేసి ఆగస్టు 1వ తేదీన విడుదల చేస్తాం' అని వివరించారు.

కోలీవుడ్‌లో చెరిగిపోని పేరు నగేష్

● దర్శకుడు కస్తూరిరాజా

తమిళ చిత్రపరిశ్రమలో ఎన్నటికీ చెరిగిపోని పేరు హాస్య దిగ్గజం నగేష్ అని ప్రముఖ దర్శకుడు కస్తూరిరాజా పేర్కొన్నారు. జై స్టూడియోస్ క్రియేషన్స్ పతాకంపై సాయి కావ్య, సాయి కైలాష్ సమర్పణలో పద్మరాజు జయశంకర్ నిర్మాణంలో భాస్కర్ సదాశివం దర్శకత్వంలో సామాజిక సందేశాత్మక చిత్రంగా తెరకెక్కిన మూవీ 'ఉరుట్టు ఉరుట్టు'. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ వేడుక శుక్రవారం రాత్రి నగరంలో జరిగింది. ఇందులో దివంగత హాస్య దిగ్గజం నగేష్ మనవడు, హీరో ఆనంద్ బాబు తనయుడు గజేష్ నగేష్ హీరోగా నటించగా, రిత్విక శ్రేయ హీరోయిన్. ఈ ఆడియో వేడుకలో దర్శకులు కస్తూరిరాజా, విక్రమన్, ఆర్‌వీ ఉదయ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. చిత్ర దర్శకుడు భాస్కర్ సదాశివం, నిర్మాత పద్మరాజు జయశంకర్‌తో పాటు చిత్ర బృందం పాల్గొని ఆడియో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా కస్తూరి రాజా మాట్లాడుతూ, 'నగేష్ మనవడు గజేష్‌ను ఆశీర్వదించాలనే ఇక్కడకు వచ్చాను. ధనుష్‌ను హీరోగా పరిచయం చేసే నిర్మాతల కోసం నేను గాలించలేదు. అపుడు నేనే నిర్మాత, నేనే దర్శకుడిని. కానీ, ఆనంద్ బాబు తన కుమారుడి కోసం ప్రతి ఆఫీసుకు వెళ్ళారు. నా కార్యాలయానికి కూడా వచ్చారు. తన కుమారుడుని లాంచ్ చేసేందుకు ఆ తండ్రి పడిన బాధకు మీడియా మంది ఇవ్వాలి. ఈ సినిమాను విజయవంతం చేయాలి' అని కోరారు. ఆ తర్వాత నటులు ఆనంద్ బాబు, గజేష్, రిత్విక, నిర్మాతలు ప్రసంగించారు.


హీరోయిన్లతో గజేష్ నగేష్

నయనతార స్థానంలో త్రిష?

దివంగత రామ నారాయణన్ దర్శకత్వంలో 1990లో వచ్చిన సూపర్‌హిట్ చిత్రం 'ఆడి వెల్లి'. సీత ప్రధాన పాత్ర పోషించారు. ఆ చిత్రంలోని సెంటిమెంట్, పాము, ఏనుగు సన్నివేశాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాను రీమేక్ చేసేందుకు రామ నారాయణన్ కుమారుడు మురళి రామస్వామి సన్నాహాలు మొదలుపెట్టారు. సీత పోషించిన పాత్రకు మొదట నయనతారను ఎంపిక చేసినట్టు వార్తలు ఉన్నాయి. అయితే ఆమె ఏకంగా రూ.15 కోట్ల మేరకు రెమ్యునరేషన్ డిమాండ్ చేసినట్టు వినికిడి. దీంతో ఆమె స్థానంలో త్రిషను సంప్రదించగా ఆమె సానుకూలంగా స్పందించినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఈ ప్రాజెక్టు ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయి. వాస్తవానికి డివోషనల్ మూవీ 'మూక్కుత్తి అమ్మన్-2'లో త్రిషను ఎంపిక చేయాలని దర్శకుడు ఆర్‌జే బాలాజీ ప్రయత్నించారు. అయితే, ఆ సమయంలో త్రిష బిజీగా ఉండటంతో ఆ ప్రాజెక్టు వదులుకున్నారు. ఇపుడు 'ఆడి వెల్లి' వంటి భక్తిరస చిత్రంలో నటించేందుకు త్రిష సమ్మతం తెలిపినట్టు వినికిడి.




కచేరీలో శ్రీరామపాద భాగవతర్

అంతరించిపోతున్న నామ సంకీర్తనను ఆదుకునేందుకు నడుం బిగించారాయన.. సంగీత, సాహిత్య సమ్మేళనంతో దానికి ఊపిరిలూది, విశ్వవ్యాప్తం చేసేందుకు అహరహం కృషి చేస్తున్నారాయన.. తమిళ గడ్డపై వున్నా తెలుగుబిడ్డగానే కళామతల్లి సేవలో పునీతమవుతున్న ఆయనే శ్రీరామపాద భాగవతర్. ఆయన పదనామకీర్తనలు ఈ 'సండే స్పెషల్'..

\- చెన్నై, ఆంధ్రజ్యోతి

'నామ సంకీర్తన' ప్రచారం

శ్రీరామపాద లక్ష్యం

SUNDAY SPECIAL

● కళామతల్లి సేవలో పునీతం ● 16 సంవత్సరాలుగా అవిరళ కృషి

చెన్నైలో నివాసముంటున్న శ్రీరామపాద భాగవతర్ దక్షిణ భారత సంప్రదాయ 'నామసంకీర్తన' కళాకారులు. ఆయన కృష్ణా జిల్లా బందరుకు చెందిన ప్రసిద్ధ తెలుగు సంగీత కుటుంబంలో జన్మించారు. పూర్వీకులైన హరి నాగభూషణం మహోన్నతమైన వాయులీన విద్వాంసులు. ఆయన కుమారులు (శ్రీరామ పాద తల్లికి మేనమామలు) హరి శంకరశాస్త్రి, హరి అచ్యుత రామ శాస్త్రి గాత్ర, వాయులీన విద్వాంసులు. శ్రీరామపాద తల్లి అన్నపూర్ణ నాట్యంలోనే కాకుండా, వైణికురాలు. శ్రీరామ పాద భాగవతర్‌కు వాయులీనంలో ప్రవేశం ఉన్నా అంతరించిపోతున్న 'నామ సంకీర్తనం' ప్రచారమే ప్రధాన ధ్యేయంగా గాయకుడిగా గత 16 సంవత్సరాలుగా ఎన్నో ప్రదర్శనలు ఇస్తున్నారు.


భాగవతార్ దంపతులు

అంతర్జాతీయ సంస్థలతో పని..

శ్రీరామపాద చిన్న వయసులో గుంటూరులో సంగీతాభ్యాసం, విద్యాభ్యాసం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 7, 10 తరగతుల పరీక్షల్లో ర్యాంకు సాధించారు. హిందూ కాలేజీలో ఇంటర్మీడియేట్, ఆపై మెరిట్‌లో ఇంజనీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, లా చదివారు. అంతర్జాతీయ సంస్థల్లో పని చేస్తూ విశిష్టమైన లీడర్‌గా వందలమందికి ఆదర్శంగా నిలిచారు. శ్రీరామపాద తాతయ్య ఆంధ్రా బ్యాంకులో పని చేశారు. ఆ బ్యాంక్ వ్యవస్థాపకులు పట్టాభి సీతారామయ్యకు ఆప్తులు. తండ్రి ప్రభాకరరావు సీనియర్ బ్యాంక్ అధికారిగా పని చేశారు. తల్లి భర్తకు చేదోడువాదోడుగా వుంటూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు పట్టణాల్లో వారిద్దరూ హిందూ ధర్మ ప్రచారాన్ని చేసి ఎన్నో కుటుంబాలకు మార్గదర్శకంగా నిలిచారని శ్రీరామపాద తెలిపారు. ఇప్పుడు తన వంతుగా తెలుగు ప్రజల అభ్యున్నతి, ప్రయోజనం కోసం శ్రీరామపాద భాగవతర్ కృషి చేస్తున్నారు. సాంఘిక, సామాజిక, రాజకీయ, ఆధ్యాత్మిక విషయాలపై ప్రస్తుత కాలంలోని అనుభవాలను జోడిస్తూ సూటిగా, నిక్కచ్చిగా ప్రముఖ దినపత్రికల్లో వ్యాసాలు రాస్తున్నారు. ప్రత్యేకించి, శ్రీరామపాదకు వున్న విషయ అవగాహన సామర్థ్యానికి ప్రముఖ ప్రవచనకర్తలు సైతం ప్రశంసిస్తూ ఆయన దర్మాగ్రహాన్ని, ధైర్యాన్ని మెచ్చుకున్నారు.

పీఠాధిపతుల ఆశీస్సులు..

ఆధునిక కాలంలో 'భగవన్నామ స్మరణ' మాత్రమే అన్ని సమస్యలకు మార్గమని శ్రీ మహావిష్ణువు నారదుడితో అన్నట్లు... శ్రీరామపాద వ్యక్తిగతంగా ఎంతో బిజీగా వున్నా- సమాజంలో అందరికీ వృత్తి, ఉద్యోగం, వ్యాపారపరంగా సహజంగా ఉండే ఒత్తిడుల నుంచి ఉపశమనం కలగడం కోసం సుమారు 400 సంవత్సరాల చరిత్ర కలిగిన పురాతన భజన సంప్రదాయంలో కచేరీలు చేస్తున్నారు. వీరు డాక్టర్ వేణుగోపాల్ భాగవతర్ వద్ద శిక్షణ పొందారు. నేటికీ ఈ కళలో ప్రముఖుల పద్ధతి, మెళుకువలను సాధన చేస్తున్నారు. ఇప్పటికే తమిళనాడులోని కుంభకోణం, తంజావూర్, పండరీపురం, అరుణాచల క్షేత్రం, పరమ భాగవతోత్తములైన భోదేంద్రస్వామి, శ్రీధర అయ్యావారు, సద్గురు స్వామి మఠాలు, కాంచీపురంలోని కంచికామకోటి పీఠం, తిరుమల నాదనీరాజనం (పలుమార్లు), శృంగేరి శారదా పీఠ మహా సంస్థానం, తిరుచ్చిరాపల్లి, మదురై, కురుక్షేత్ర, వారణాసి, ముంబై, గురువాయూర్, గుంటూరు, విజయవాడ, నెల్లూరు, చెన్నైలోని త్యాగబ్రహ్మ గానసభ, కృష్ణగాన సభ వంటి ప్రఖ్యాత సంగీత సభల్లో కచేరీలు చేసి శృంగేరి, కంచి పీఠాధిపతుల ఆశీస్సులు, 'నాదోపాసక, ధర్మయోగి' అని సంగీత రసజ్ఞుల ప్రశంసలు పొందారు. అలా శ్రీరామపాద నామసంకీర్తన బాణి అనతికాలంలోనే ప్రాచుర్యం పొందింది.

దూరదర్శన్, ఎస్వీబీసీ, శంకర టీవీ ఛానళ్లలో శ్రీరామపాద కచేరీలు ప్రసారమవుతున్నాయి. 'తెలుగువాడిగా ఇంతటి గౌరవం దక్కడం తల్లిదండ్రులు, జన్మభూమి పెట్టిన భిక్ష, జగద్గురువుల కృప' అంటారు శ్రీరామపాద. యాంత్రికంగా పరుగులు తీసే జీవిత కాలంలో భక్తి సంగీతంలో తాను చేస్తున్న కృషి వెనుక తన సతీమణి రమ ప్రోత్సాహం, సహాయ సహకారాలు ఎంతో వున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరిలో ఉత్తర అమెరికా తెలుగు సమితి అంతర్జాతీయ సదస్సులో ఆయన విశిష్ట అతిథిగా సుమారు 75 నిమిషాల పాటు 'భక్తి - సంగీతం'పై ప్రసంగించారు. అదే విధంగా 'తానా' సైతం శ్రీరామ పాద భాగవతర్‌ను మహాసభలకు ఆహ్వానించింది.



బాల్యం నుంచే..

చిన్న వయసులోనే గుంటూరులో విద్వాన్ సాగి వెంకటేశ్వరరావు వద్ద వయోలిన్, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వైణికులు అయ్యగారి శ్యామసుందరం, చెన్నైలో పద్మ విభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ శిష్యుడైన విద్వాన్ రంగనాథన్ వద్ద సంగీత శిక్షణ పొందారు. వీరితో పాటు అక్కలిద్దరిలో ఒకరికి వీణ, మరొకరికి గాత్రం, తమ్ముడికి మృదంగంలో శిక్షణ ఇప్పించారు. శ్రీరామపాద భాగవతర్ బాల్యం నుంచి ఆధ్యాత్మికత వైపు మొగ్గు చూపి సనాతన హిందూ ధర్మాచరణ చేస్తూ తీర్థ, క్షేత్ర దర్శనంలో పూజ్యులు, యోగులను కలిసి, వారినుంచి గ్రహించిన జ్ఞానాన్ని తన కచేరీ, రచన, ప్రవచనాల ద్వారా ప్రజలకు పంచుతూ భక్తిని సంగీతం ద్వారా ప్రచారం చేస్తున్నారు. మరో పక్క పురాతన దేవాలయ ఆచారాలు, గోసేవ, వేదపోషణ లాంటి ధార్మిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు.


శ్రీరామపాద భాగవతర్

తెలుగు రాష్ట్రాల్లో ప్రాచుర్యం కోసం..

శ్రీరామపాద తనదైన శైలిలో కీర్తన, నామావళి రచించి పాడతారు. ఆయన కచేరీకి గాత్ర వాద్య సహకారం అందించేవారంతా తమిళనాడులోని సుప్రసిద్ధ విద్వాంసులే. వీరిలో కొంతమంది ప్రముఖ సినీ సంగీత దర్శకులకు వాద్య సహకారం అందించినవారే. నాలుగు శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ భజన సంప్రదాయం తెలుగు రాష్ట్రాల్లో అంతగా ప్రాచుర్యం పొందలేదు. అందుకే మన తెలుగువారి అభ్యున్నతి, శ్రేయస్సు కోసం ఈ ఉత్సాన్ని ముందుకు తీసువెళ్లాలనే ఉద్దేశముందని, తద్వారా నేటి యువతరానికి, భావితరాలకు ఎంతో లాభముంటుందని శ్రీరామపాద వివరించారు. ఎన్నో ఆహ్వానాలు వస్తున్నా.. ఎక్కడ భక్తి, సంగీతం వ్యాపార ధోరణిగా ఉండదో అక్కడ మాత్రమే శ్రీరామపాద భాగవతర్ కచేరీ ఇవ్వడం విశేషం.

పుస్తక పఠనంతో మానసిక ఒత్తిడి దూరం

● పవర్ జనరేషన్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ రాధాకృష్ణన్

పెరంబూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం మానసిక ఒత్తిడిని దూరం చేస్తుందని పవర్ జనరేషన్ కార్పొరేషన్ చైర్మెన్ డా.రాధాకృష్ణన్ తెలిపారు.కడలూరు జిల్లా నైవేలీలోని ఎన్ఎల్‌సీ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో 24వ పుస్తక ప్రదర్శన ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రదర్శనలో 7వ రోజైన శనివారం డా.రాధాకృష్ణన్ పుస్తక ప్రదర్శనను వీక్షించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎన్ఎల్‌సీ చైర్మెన్ ప్రసన్న కుమార్ మోటుపల్లి మాట్లాడుతూ... 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని, ఆ లక్ష్యం సాధించాలంటే జ్ఞానం చాలా ముఖ్యమన్నారు. అనంతరం రాధాకృష్ణన్ మాట్లాడుతూ... 24 ఏళ్లుగా నడుపుతున్న నైవేలీ పుస్తక ప్రదర్శన దేశంలోని పెద్ద పుస్తక ప్రదర్శన స్థాయిలో ఉందన్నారు. పుస్తకాలు చదవడం వల్ల మాత్రమే జ్ఞాపకశక్తి మెరుగుపడి నిజమైన జ్ఞానం లభిస్తుందని రాధాకృష్ణన్ సూచించారు.


స్టాల్స్‌లో పుస్తకాలు పరిశీలిస్తున్న రాధాకృష్ణన్, ఎన్ఎల్‌సీ చైర్మెన్ ప్రసన్నకుమార్

కల్తీ ఎరువులు, నకిలీ విత్తనాల నిరోధానికి కొత్త చట్టాలు

● కేంద్ర మంత్రుల ప్రకటన

టి.నగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పత్తి సాగుబడి పెంచేందుకు చర్యలు తీసుకుంటామని, నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువుల అమ్మకాలను నిరోధించడానికి కఠినమైన చట్టాలు తీసుకువస్తామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ప్రకటించారు. కేంద్ర పత్తి పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో పత్తి ఉత్పత్తి పెంచేందుకు గల అవకాశాలపై కోయంబత్తూరులోని చెరకు పరిశోధనా కేంద్రం హాలులో శుక్రవారం సాయంత్రం ఓ సదస్సు జరిగింది. ఆ సదస్సులో కేంద్ర మంత్రులిద్దరూ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. సదస్సు అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రజల ప్రాథమిక అవసమైన దుస్తుల తయారీలో పత్తి ప్రధాన పాత్ర పోషిస్తోందని, ప్రస్తుతం పత్తి ఉత్పత్తి, నాణ్యత తగ్గాయని చెప్పారు. ఈ నేపథ్యంలో రైతులు, వ్యవసాయ నిపుణులు తదితరులు సమష్టిగా 'మోదీ మిషన్' పేరుతో దేశ వ్యాప్తంగా పత్తి సాగుబడిని పెంచేందుకు తీవ్ర చర్యలు చేపడతామన్నారు. దీని కోసమే 'టీమ్ కాటన్' అనే సంస్థ కూడా రూపొందించినట్లు చెప్పారు. దక్షిణ భారతదేశంలో యాంత్రిక పరిశోధన కేంద్రం నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని పురుగుల (తెగులు) తాకిడిని ఎదుర్కొనేందుకు 'ఏఐ' సాంకేతిక పరిజ్ఞానంతో చర్యలు చేపడతామన్నారు. పత్తిపై విధిస్తున్న 11 శాతం సుంకాన్ని రద్దు చేయాలని కోరుతున్నారని, ఈ విషయమై కేంద్రం చర్యలు చేపట్టనుందని చెప్పారు.


కోవైలో పత్తిసాగుపై ఏర్పాటు చేసిన ప్రదర్శన తిలకిస్తున్న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తదితరులు


11 స్క్వేర్ రెస్టోబార్ ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

నుంగంబాక్కంలో '11 స్క్వేర్ రెస్టోబార్'

చెన్నై, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆధునిక ఆహారశైలికి ప్రసిద్ధి చెందిన '11 స్క్వేర్ రెస్టోబార్' నుంగంబాక్కం వల్లువర్‌కోట్టం హైరోడ్డులో ఏర్పాటైంది. శనివారం దీనిని నిర్వాహకులు లాంఛనంగా ప ఆరంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 11 స్క్వేర్ ప్రతి ఒక్కరినీ తినడానికి, తాగడానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.రాత్రి జీవితపు ఉత్సాహాన్ని ఉన్నతమైన భోజనం, సంగీతం, స్టయిలిష్ వాతావరణంలో అందించనున్నట్లు తెలిపారు.

నాబార్డ్ 44వ వ్యవస్థాపక దినోత్సవం


అడయార్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) 44వ వ్యవస్థాపక దినోత్సవం నగరంలో తాజాగా జరిగింది. దేశ గ్రామీణాభివృద్ధిలో నాబార్డ్ కీలక పాత్ర పోషిస్తుంది. ఈ నేపథ్యంలో నాబార్డ్ తన వ్యవస్థాపక దినోత్సవంలో కీలకమైన విధాన నిర్ణేతలు, రాష్ట్ర అధికారులు, బ్యాంకింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఇందులో భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కొత్త విధానాలను ఆవిష్కరించే విషయంపై ప్రధానంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎం.నాగరాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎం.మురుగానందం, నాబార్డ్ చైర్మన్ షాజి కేవీ, నాబార్డ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్లు జీఎస్ రావత్, ఏకే సూద్‌లతో పాటు ఇండియన్ బ్యాంకు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


తన జన్మదినం సందర్భంగా సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ దంపతులను మర్యాదపూర్వకంగా కలుసుకున్న రాష్ట్ర మంత్రి టీఆర్బీ రాజా

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో రాష్ట్ర మంత్రులుఆనం రామనారాయణరెడ్డి, కొల్లు రవీంద్ర, బీసీసీఐ స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ కోచ్ అంకిత్ కలియార్, సినీ హీరో సంతోష్ శోభన్, నటుడు అశోక్ బాబు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.



ఆనం రామనారాయణరెడ్డి - కొల్లు రవీంద్ర - సంతోష్ శోభన్ - అశోక్‌బాబు

అతి త్వరలో వంద భాషల్లో శ్రీమద్ భగవద్గీత

● గాయకుడు గజల్ శ్రీనివాస్



తిరుమల, జూలై12(ఆంధ్రజ్యోతి): శ్రీమద్ భగవద్గీతను అతి త్వరలో నూరు భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని ప్రముఖ గాయకులు గజల్ శ్రీనివాస్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏడాదిగా శ్రీమద్ భగవద్గీతను నూరు భాషల్లో చేయాలనే యజ్ఞంలో కృషి చేస్తున్నామన్నారు. తెలుగు, సంస్కృతంలో తాను పాడిన భగవద్గీతను తిరుపతిలో విడుదల చేసి స్వామికి అంకితం చేస్తామన్నారు.

శ్రీహరి దర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.84 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 70,217

తలనీలాలు సమర్పించినవారు: 31,155



గజరాజుల కట్టడికి యాక్షన్‌ప్లాన్

● దక్షిణాది రాష్ట్రాల సమాలోచనలు ● నోడల్ కమిటీకి నివేదిక అందజేసిన సబ్ కమిటీ



మంగళం, జూలై 12(ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో ఏనుగుల దాడులు పెద్దసమస్యగా మారింది. ఈ క్రమంలో 2024 డిసెంబరు 18న తమిళనాడు మాజీ పీసీసీఎఫ్ సంజయ్ కె శ్రీనివాస్ చైర్మన్‌గా ఆరుగురితో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సబ్ కమిటీ తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో ఏనుగుల సంతతి, వాటి కదలికలు, ప్రజల ఆస్తులు, ప్రాణాలకు నష్టం కలగకుండా ఎలా కట్టడి చేయాలి అనే దానిపై యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది. పూర్తి స్థాయిలో పరిశీలించి, నివేదికను నోడల్ కమిటీకి అందజేసింది.

ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల పరిశీలన

దక్షిణాది రాష్ట్రాల సంయుక్త ఆధ్వర్యంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో ఏర్పడిన నోడల్ కమిటీ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఏనుగులు ప్రవేశించే, అవి తిరిగి వెళ్లే మార్గాలను రెండు రోజుల క్రితం పరిశీలించింది. ఏనుగులు ఎక్కువగా సంచరిస్తున్న పలమనేరు, తలకోన, కల్లూరు, భీమవరం, బాలపల్లి, మామండూరు, తిరుమల నడక మార్గంలోని ఏడవ మైలును సందర్శించింది. శేషాచల కొండల్లోకి వస్తున్న ఏనుగులు సమీప భాకరాపేట, కల్లూరు, మామండూరు, బాలపల్లి, భీమవరం తదితర ప్రాంతాల్లో పంటలపై దాడి చేస్తున్న విషయాలను అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. అనేక సందర్భాల్లో రైతుల ప్రాణాలను కూడా బలి తీసుకున్నట్లు ఆయా ప్రాంతాల వారు కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలోనూ ఈ కమిటీ పర్యటిస్తోంది. కేరళ నుంచి తమిళనాడు, కర్ణాటక మీదుగా ఆంధ్ర రాష్ట్రంలోకి ఏనుగుల మంద ఎప్పుడు వచ్చింది.. అందులో ఎన్ని ఏనుగులు ఉన్నాయి.. అవి ప్రయాణించే మార్గం, ఎక్కడెక్కడ ఎంతకాలం ఉంటున్నాయి.. ఆ సమయంలో జరుగుతున్న ఆస్తి, ప్రాణ నష్టాల గురించి తెలుసుకుంటున్నారు. ఆ తర్వాత వీటిని నిలువరించడానికి గల అవకాశాలను పరిశీలిస్తారు. అదే సమయంలో అవసరమైన ఆహారం, నీరు పుష్కలంగా లభించే ప్రాంతాలను గుర్తిస్తారు. వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపైనా కసరత్తు చేస్తున్నారు. వీటన్నింటిపై పూర్తి స్థాయిలో నివేదిక రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తారు. కమిటీ తీసుకున్న నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయగలిగితే మేలు జరిగే అవకాశముంటుందని రైతులు భావిస్తున్నారు.

ఏనుగులు తిరిగే ప్రాంతాలను పరిశీలిస్తున్న నోడల్ కమిటీ సభ్యులు




ప్రీ-నేషనల్స్‌కు జిల్లా షూటర్స్ ఎంపిక



ప్రీ-నేషనల్స్‌కు ఎంపికైన జిల్లా షూటర్స్

తిరుపతి(క్రీడలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలోని ఎన్టీఆర్ కేవీకే 10మీటర్ల ఎయిర్ రైఫిల్/పిస్టల్ షూటింగ్ కేంద్రంలో శిక్షణ పొందిన పదిమంది షూటర్లు ప్రీ-నేషనల్స్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రేంజ్‌లో ఇటీవల హైదరాబాదు గచ్చిబౌలిలో రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 11మంది ప్రాతినిధ్యం వహించారు. ఇందులో లవకుమార్, సాయిఅచ్యుత్‌రాయల్, హేమచంద్, పురుషోత్తం, భార్గవి, హస్విత, యోక్షిత, నందగోపాల్, హితేష్, వైష్ణవీలు నేషనల్స్‌కు ఎంపికయ్యారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ కేవీకేలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.దేవరాజ్, డీఎస్‌డీవో శశిధర్ ఆధ్వర్యంలో క్రీడాకారులను సన్మానించి, అభినందించారు. సంఘం ఉపాధ్యక్షుడు సిద్ధయ్య, కార్యదర్శి డాక్టర్ భానుప్రకాష్, జయరాజ్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం



గ్రాప్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న మాణిక్యాలు

తిరుపతి(క్రీడలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య కూడలి సమీపంలోని గిరిజన భవన్‌లో శనివారం సాయంత్రం 5వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్-2025 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఏపీ క్రీడా భారతి అధ్యక్షుడు ఎం.వి.మాణిక్యాలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. సబ్ జూనియర్, క్యాడెట్(బాలబాలికలు) విభాగాల్లో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన అథ్లెట్లను ఆయన పరిచయం చేసుకున్నారు. క్రీడల ద్వారా యువతలో శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ క్రీడా భారతి కార్యదర్శి ధనంజయరెడ్డి, సంయుక్త కార్యదర్శి సురేంద్ర రెడ్డి, డీఎస్‌డీవో ఎన్.శశిధర్, ఏపీ గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు రేఖారాణి పాల్గొన్నారు.

చంద్రగిరిలో మ్యాట్రిక్ థర్మల్ 4 డ్రోన్‌తో నైట్ బీట్

● చిమ్మచీకట్లో ఆటోలో మద్యం తాగిన నలుగురి గుర్తింపు



యువకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

చంద్రగిరి, జూలై 12(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తొండవాడ, బీడీ కాలనీ, జడ్పీ హైస్కూల్ ప్రాంతంలో పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి మాట్రిక్ థర్మల్ 4 డ్రోన్ కెమెరాతో నైట్ బీట్ నిర్వహించారు. తొండవాడ జాతీయ రహదారి సమీపంలోని చెట్ల పొదల్లో చీకట్లో ఓ ఆటోలో నలుగురు వ్యక్తులు మద్యం తాగుతున్న దృశ్యాలు ఇందులో రికార్డు అయ్యాయి. వెంటనే డ్రోన్ టీమ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు అక్కడికి చేరుకుని వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అందరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. రాత్రి 8 గంటల తర్వాత పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయం ఉంటుందన్న విషయాన్ని గుర్తు చేశారు.

హిందూ ఆలయాల యువచైతన్య మహాపాదయాత్ర ప్రారంభం



ఎర్రావారిపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) హిందూ దేవాలయాల యువచైతన్య మహాపాదయాత్రను శ్రీభువనగిరి పీఠాధిపతి కమలానంద భారతి ఆధ్వర్యంలో శనివారం తలకోన నుంచి ప్రారంభమైంది. 8నెలల పాటు సాగే పాదయాత్ర గురించి ఆయన మాట్లాడుతూ 'భగవద్భక్తి-కర్తవ్యదీక్ష-సమాజశక్తి' నినాదంతో తలకోన నుంచి సాధుసంపత్‌లు యాత్ర సంకల్పించారని చెప్పారు. సనాతన హైందవ ధర్మపరిరక్షణ, దేవాలయాలు, సంస్కృతాంధ్ర భాషా పరిరక్షణ, హిందూ యువ చైతన్యం లక్ష్యాలతో యాత్ర కొనసాగుతుందని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, సత్యసాయి, కర్నూలు, అనంతపురం, నారాయణపేట, గద్వాల్, వనపర్తి, నంద్యాల, కడప, నెల్లూరు జిల్లాల్లో 6 నెలల్లో 8 వేల గ్రామాల్లో పాదయాత్ర జరుగుతుందని వివరించారు. ఫిబ్రవరిలో తిరుపతిలో ధార్మిక మహాసమావేశంతో ముగియనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు రాఘవులు, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, టీడీపీ నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు హేమాంబరధర నాయుడు, తలకోన ట్రస్ట్ చైర్మన్ సోమనాథరెడ్డి, ఈవో రవీంద్రరాజు, టీడీపీ మండల నాయకులు గోపి, కేశవుల నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా వేద విశ్వవిద్యాలయ వార్షికోత్సవం

● సుదర్శన సహిత పారమాత్మిక హోమం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 12(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ 20వ వార్షికోత్సవం అత్యంత వేడుకగా సాగింది. ఉదయం సుదర్శన సహిత పారమాత్మిక హోమం చేపట్టారు. అనంతరం నిర్వహించిన సభలో వీసీ ప్రొఫెసర్ రాణిసదాశివమూర్తి, రిజిస్ట్రార్ భాస్కరుడు పాల్గొని మాట్లాడారు. టీటీడీ సహకారంతో రెండు దశాబ్దాలుగా వేద విజ్ఞాన వ్యాప్తిలో వేద యూనివర్సిటీ ఎంతో కృషి చేసిందన్నారు. ఎంతో మంది వేద పండితులను తీర్చిదిద్దిందని తెలిపారు. వేద విజ్ఞానంపై విలువైన పరిశోధనలు సాగాయన్నారు. అనేక విలువైన వేద సంబంధ గ్రంథాలు ప్రచురించినట్టు చెప్పారు. అనేక మంది వేద పండితులు యూనివర్సిటీని సందర్శించారని తెలిపారు. వేద సంబంధ విషయాలపై సదస్సులు, వర్క్‌షాప్‌లు చేపట్టినట్టు వివరించారు. వేద, ఆగమ, పౌరోహిత్య, వేదాంగ, వేద భాష్యాలపై విస్తృత అధ్యయనం సాగుతున్నట్టు వివరించారు. శ్రీవారి అనుగ్రహం, టీటీడీ అధ్యక్షులు, ఈవోల సహకారంతో ఎంతో అభివృద్ధిని సాధించిందన్నారు. విద్యార్థులకు వస్త్రాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వేద విశ్వవిద్యాలయంలో హోమం నిర్వహిస్తున్న పండితులు

వార్షికోత్సవ వేళ రాజకీయ వివాదం!

● హాజరుకాని బీజేపీ, టీడీపీ నాయకులు

వేద విశ్వవిద్యాలయ వార్షికోత్సవ వేళ రాజకీయ వివాదం రేగింది. టీటీడీ సహకారంతో నిర్వహిస్తున్న వేద విశ్వవిద్యాలయం వార్షికోత్సవానికి టీటీడీ చైర్మన్‌ను, ఈవోను, యూనివర్సిటీ అధికారులను ఆహ్వానించలేదనే ఆరోపణలు వినిపించాయి. దీనికి కారణాలు ఏమిటనే విషయాన్ని పక్కనపెడితే స్థానిక బీజేపీ, టీడీపీ నేతలను మచ్చిక చేసుకోవడానికి వేద వర్సిటీ ఉన్నతాధికారులు ప్రయత్నిస్తున్నారనే విమర్శ తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో పలు అధికారిక హోదాల్లో ఉన్న స్థానిక బీజేపీ, టీడీపీ నాయకులను వార్షికోత్సవానికి ఆహ్వానించారు. ఆహ్వాన పత్రికలోనూ వారి పేర్లను ముద్రించారు. అయితే తుదకు వారు కార్యక్రమానికి హాజరుకాలేదు. ఇలాంటి పరిస్థితుల మధ్య వేద వర్సిటీ వార్షికోత్సవం సాగింది. ఈ వివాదం ఎక్కడికి దారితీస్తుందనేది ఆసక్తిగా మారింది.

విమానాశ్రయ ప్రైవేటీకరణను ఆపండి

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్



నిరసన తెలుపుతున్న చింతామోహన్

రేణిగుంట, జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రైవేటీకరణ చేయరాదని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. చింతామోహన్ మాట్లాడుతూ తిరుపతి విమానాశ్రయాన్ని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా అంతర్జాతీయ స్థాయికి పునాది వేశారని గుర్తు చేశారు. రాయలసీమలో ఇది ఒకే ఒక అంతర్జాతీయ విమానాశ్రయమని తెలిపారు. దీన్ని అదానీకి అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం ఫైలు సిద్ధం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రావణ, వడివేలు, మురళి, సురేష్ ,శివ, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీపై బండి వ్యాఖ్యలు ఆక్షేపణీయం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డి

తిరుపతి(జీవకోన), జూలై 12(ఆంధ్రజ్యోతి): టీటీడీ గురించి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఆక్షేపిస్తున్నామని వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఒక ప్రకటనను శనివారం వీడియో ద్వారా విడుదల చేశారు. టీటీడీలో వెయ్యిమందికి పైగా అన్యమత ఉద్యోగులు ఉన్నారని బండి సంజయ్ చెప్పడం సరికాదని, వారిని తొలగించాలంటూ హెచ్చరించడాన్ని తప్పుబట్టారు. ఈ వ్యాఖ్యలు శ్రీవారి ఆలయంపై దాడిలా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల వెనుక కుట్ర దాగి ఉందన్న అనుమానం కలుగుతోందని తెలిపారు. టీటీడీని ప్రక్షాళన చేస్తామంటున్న రాష్ట్ర ప్రభుత్వం బండి వ్యాఖ్యలను సమర్థించడం సరికాదని పేర్కొన్నారు.

తిరుమలలో సర్వే చేసి అన్యమతస్థులుంటే తొలగిద్దాం

● భూమనకు భానుప్రకాష్‌రెడ్డి సవాల్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 12(ఆంధ్రజ్యోతి): 'తిరుమలలో ఇంటింటి సర్వే చేద్దాం... ఎవరి ఇళ్లలోనైనా అన్య దేవుళ్ల సాహిత్యం, చిత్రపటాలు కనిపించినా ఆ ఉద్యోగులను టీటీడీ ఉద్యోగాల నుంచి తొలగిద్దాం... మీరు సహకరిస్తారా' అని మాజీ ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆ మేరకు ఆయన శనివారం ఓ వీడియో విడుదల చేశారు. టీటీడీలో వెయ్యిమంది అన్యమతస్తులు ఉన్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యల వెనుక కుట్ర దాగి ఉందని భూమన పేర్కొనడాన్ని భానుప్రకాష్‌రెడ్డి ఖండించారు. '2019 నుంచి 2024 వరకు హిందూ వ్యతిరేక ప్రభుత్వం రాజ్యమేలింది. ఓ నాస్తికుడు టీటీడీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. హిందూ ఆలయాలు, పవిత్ర రథాలపై దాడులు జరిగాయి. టీటీడీ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా భారీ అవినీతికి పాల్పడ్డారు' అంటూ ధ్వజమెత్తారు. తిరుమలలో కొందరు పేరుకు రాముడు, కృష్ణుడుగా ఉన్నారుగాని వారి ఇళ్లలో మాత్రం ఏసు చిత్రపటాలు ఉంటున్నాయన్నారు. కరుణాకరరెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఇంటింటి సర్వేకు అంగీకరించి తమకు సహకరించాలని కోరారు.

జీవన మార్గాన్ని ఉపదేశించిన శ్రీమద్భగవద్గీత గజల్ గానం

● గజల్ గానంతో ఆహూతులను మంత్రముగ్ధులను చేసిన గజల్ శ్రీనివాస్



గజల్స్ గానం చేస్తున్న గజల్ శ్రీనివాస్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, నైతిక జీవన మార్గాన్ని ఉపదేశించేలా శ్రీమద్భగవద్గీత సారాన్ని ప్రఖ్యాత గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ తన స్వరంలో ఒలికించారు. అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో 'శ్రీమద్భగవద్గీత' గజల్ గానం నిర్వహించారు. భగవద్గీతలోని శ్లోకాలను రాగయుక్తంగా ఆలపించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఎంతో సాంస్కృతిక వైభవం గల తిరుపతిలో ఇటువంటి కార్యక్రమాన్ని మరింత సాంస్కృతిక శోభను తెస్తాయని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని కోరారు. టీటీడీ మాజీ ఛైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి మాట్లాడుతూ తిరుపతిలో జీవించడమే గొప్ప అదృష్టమన్నారు. పవిత్రమైన తిరుపతిలో ఇటువంటి కార్యక్రమాలు మరింత మంచి వాతావరణాన్ని కలుగ చేస్తాయన్నారు. స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా తిరుపతి కేంద్రంగా అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉందన్నారు. ఈ క్రమంలో భగవద్గీతను గజల్ శ్రీనివాస్ నోట వినడం గొప్పగా ఉందన్నారు. గజల్ శ్రీనివాస్ ఆలపించిన గజల్ ఆడియో పెన్‌డ్రైవ్‌ను ఆవిష్కరించారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఉమా ముద్దుబాల బృందం ప్రదర్శించిన అష్టలక్ష్మీ వైభవం అత్యద్భుతంగా సాగింది. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్, ఉమా ముద్దుబాల, ఇతర అతిథులను అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గౌరవ కార్యదర్శి పొంద్ర సురేంద్ర నాయుడు సత్కరించారు. సభను ఆకెళ్ల విభీషణశర్మ సమన్వయం చేశారు. పలువురు కళాకారులు, కళాభిమానులు, నగర వాసులు పాల్గొన్నారు.



అష్టలక్ష్మీ వైభవం నృత్య రూపకంలో ఉమా ముద్దుబాల బృందం

తిరుపతిలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

● పార్కింగ్ నిబంధనలపై ప్రైవేటు వాహనాల యజమానులకు సూచనలు

● అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరిక

తిరుపతి(నేరవిభాగం), జూలై 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు చేశారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీలు భక్తవత్సలం, రామకృష్ణమాచారి, సీఐలు, రిజర్వు బలగాలు, ఎస్టీఎఫ్ ఫోర్సుతో కలిసి నగరంలోని 10 ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. పూర్ణకుంభం సర్కిల్ నుంచి భారతి బస్టాండు వద్దకు నడుచుకుంటూ వెళ్లారు. ప్రైవేటు బస్సులు రోడ్డుపై ఇష్టమొచ్చినట్లు పెట్టడంతో అసహనం వ్యక్తం చేశారు. పద్ధతిలో పెట్టుకునే విధంగా చూడాలని ఆదేశించారు. అక్కడి నుంచి ట్రావెల్స్ ఆఫీసుల వద్దకు వెళ్లి మేనేజర్లను పిలిపించి బస్సులను ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా పెట్టవద్దని సూచించారు. అక్కడే నడి రోడ్డుపై ఆపి ఉన్న ఆటోను పరిశీలించి ట్రాఫిక్ సీఐను పిలిచి జరిమానా వేయాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఆటోలను పరిశీలించారు. ఆటోలకు డిజిటల్ స్టిక్కర్లు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ రామకృష్ణమాచారిని ఆదేశించారు. బస్టాండులో కొందరు ప్రయాణికులతో ముచ్చటించారు.



ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిమ్మినాయుడుపాలెంలో సమస్యలపై ఆరా

తిమ్మినాయుడుపాళానికి వెళ్లిన ఎస్పీ స్థానికులతో ముచ్చటిస్తూ పోలీసు శాఖ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఆకతాయిల ఆగడాలు, పోలీసులు రాత్రి గస్తీలపై అడిగి తెలుసుకున్నారు. డ్రోన్‌లతో మందుబాబులు, యువత, రౌడీలు, ఆకతాయిలు భయపడుతున్నారని, ఊరు ప్రశాంతంగా ఉందని స్థానికులు వివరించారు. అవిలాల, చంద్రగిరి, జీవకోన, ఎస్టీవీనగర్, మంగళం, తిరుచానూరు ప్రాంతాల్లో తనిఖీలు చేసి ప్రజలకు భరోసా కల్పించారు. దాదాపు రెండు గంటల పాటు తనిఖీలు చేశారు.

క్రీడల్లో పతకాలు సాధించిన టీటీడీ వీఎస్వోలకు అభినందన



తిరుమల, జూలై12(ఆంధ్రజ్యోతి): ఇటీవల అమెరికాలో జరిగిన ప్రపంచ పోలీసు క్రీడల్లో బంగారు, కాంస్య పతకాలను సాధించిన టీటీడీ విజిలెన్స్ వీఎస్వోలను టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు శనివారం అభినందించారు. తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో వీఎస్వోలు రామ్‌కుమార్, సురేంద్ర చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పతకాలను చూపించారు. టీటీడీ ప్రతిష్టను మరింత పెంచేలా విజయం సాధించినందుకు వారిని చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు.